


వెంకట్రావమ్మ నుంచి వివరాలు సేకరిస్తున్న ఏసీపీ

సర్వే పేరుతో వచ్చి దోచుకెళ్లారు...

- వైరాలో పట్టపగలే నలుగురు దుండగుల స్కెచ్
- ఒంటరి వృద్ధురాలిని నిర్బంధించి దోపిడీ
- రూ.15 లక్షల విలువైన సొత్తు అపహరణ

వైరా, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సర్వే పేరుతో వచ్చిన నలుగురు ఆగంతుకులు పట్టపగలే ఓ ఒంటరి వృద్ధురాలిని నిర్బంధించి రూ.15లక్షల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఖమ్మం జిల్లా వైరాలో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. వైరా మునిసిపాలిటీ 9వ వార్డు లీలా సుందరయ్య నగర్‌లో శీలం యుగంధర్‌రెడ్డి, లలిత దంపతులతోపాటు ఆయన తల్లి వెంకట్రావమ్మ ఉంటున్నారు. యుగంధర్‌రెడ్డి కొత్తగూడెంలోని పాలిటెక్నిక్ కాలేజీలో, లలిత వైరాలోని మధు విద్యాలయంలో ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఎప్పటి మాదిరిగానే వారు తమ విధులకు వెళ్లిపోయారు.

65 ఏళ్ల వయస్సున్న వెంకట్రావమ్మ ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సమయంలో కారులో నలుగురు ఆగంతుకులు వచ్చారు. వారిలో ఒకరు పోలీస్ యూనిఫాం ధరించి ఉన్నారు. తాము కుటుంబసభ్యుల వివరాల కోసం వచ్చామని వెంకట్రావమ్మకు చెప్పారు. వారిని నమ్మిన ఆమె అడిగిన వివరాలన్నీ తెలిపింది. అనంతరం ఇంట్లోకి వెళ్తుండగా ఆగంతుకులు ఒక్కసారిగా వెనుకనుంచి ఆమె నోరు మూసివేసి ప్లాస్టర్ వేశారు. ఇంట్లోని బెడ్‌రూంలోకి తీసుకువెళ్లి మంచంపై పడవేసి తమ వెంట తెచ్చుకున్న స్టిక్కర్లతో (మిగతా 4వ పేజీలో)



సీతమ్మసాగర్



సీతారామ ప్రాజెక్టు ప్రాంతం

మోక్షం ఎప్పుడో?

సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులపై కేంద్ర జలసంఘం టీఏసీ మెలిక

- పూర్తిస్థాయి డిజైన్లు సమర్పించాలని, పునః పరిశీలన చేయాలని ఆదేశం
- గోదావరి జలాల వాటా, మిగులు జలాల వినియోగంపై ఏపీ అభ్యంతరాలు
- ఇప్పటికే రూ.19వేల కోట్లకు చేరిన సీతారామ ఎత్తిపోతల అంచనాలు
- రూ.3426 కోట్లతో సీతమ్మసాగర్ బ్యారేజీ పనులు
- పర్యావరణ అనుమతులపై 17న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో వాదనలు
- వరుస అడ్డంకులతో వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి సాగునీటి విడుదల కష్టమే
- రెండు ప్రాజెక్టులు పూర్తయితే దాదాపు 10 లక్షల ఎకరాలు సస్యశ్యామలం

ఖమ్మం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఒకవైపు సీతారామ, సీతమ్మసాగర్‌కు కేంద్ర జలసంఘం టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) నుంచి అనుమతుల్లో జాప్యం జరుగుతుండగా, మరోవైపు సీతమ్మసాగర్‌పై చెన్నైలో పర్యావరణ అనుమతులపై ట్రిబ్యునల్ కేసు నడుస్తోంది. ఈనెల 17న వాదనలు జరగబోతున్నాయి. ఇందుకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు అవసరమైన సమాచారం సేకరించి పంపించారు. సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్ బ్యారేజి విషయంలో అనుమతులకు ఎదురవుతున్న అవాంతరాలతో ప్రక్రియ జాప్యం జరిగే పరిస్థితి కనిపిస్తోంది. గోదావరి జలాల వాటా, మిగులు జలాల వినియోగం విషయంలో సరిహద్దు రాష్ట్రాలతో సమస్య ముడి పడి ఉన్నందున కేంద్ర జలసంఘానికి ఏపీ ప్రభుత్వం గతంలో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో ఢిల్లీలో మంగళవారం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన టెక్నికల్ అడ్వయిజరీ కమిటీలో అనుమతులను వాయిదా వేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్ బ్యారేజి నిర్మాణానికి సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లు సమర్పించాలని, అలాగే కేంద్ర జలసంఘంతో పునఃపరిశీలన చేయాలని సూచించింది. దీంతో మళ్లీ అధికారుల నుంచి పూర్తిస్థాయి సమాచారం తీసుకుని పరిశీలించడంతోపాటు, ప్రత్యక్షంగా ప్రాజెక్టును పరిశీలించిన తర్వాత నివేదికలు ఇవ్వాలంటే కనీసం రెండు నెలలు పట్టే అవకాశం ఉంది.

> ఉమ్మడి జిల్లా వరప్రదాయినిగా భావిస్తున్న సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు పనుల పూర్తి మరింత జాప్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. విడివిడిగా డీపీఆర్‌లు సిద్ధం చేసి, కొన్ని పాలనాపరమైన అనుమతులు తీసుకున్న ఈ ప్రాజెక్టులకు కీలకమైన కేంద్ర జలసంఘం అనుమతి విషయంలో అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి.

గోదావరి నదిపై సీతారామ ఎత్తిపోతల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించి సస్యశ్యామలం చేసేందుకు రూ.13,500 కోట్లతో డీపీఆర్ రూపొందించి అనుమతులు పొంది పనులు ప్రారంభించారు. అయితే నిధుల జాప్యంతో నిర్మాణం ఆలస్యంగా జరిగింది. సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన పనులు అసంపూర్తిగా వదిలేయడంతో, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టి మూడు ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లడం, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి తదితరులు ప్రాజెక్టును పరిశీలించడం, ఆ తర్వాత ఏన్కూరు లింక్‌కెనాల్‌ను డిజైన్ చేసి పనులు పూర్తిచేయడం సీఎం రేవంత్‌రెడ్డితో సీతారామ ఎత్తిపోతల లిఫ్టును ప్రారంభించడం... విదితమే.

సీతారామ ఎత్తిపోతల (మిగతా 4వ పేజీలో)

నకిలీ టీఆర్‌ల బాగోతం

- భద్రాచలం మార్కెట్ కమిటీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు
- విజిలెన్సు విచారణతో వెలుగులోకి...

భద్రాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సీసీఐ పత్తి కొనుగోళ్ల వ్యవహారంలో నకిలీ తాత్కాలిక రిజిస్ట్రేషన్(టీఆర్)ల బాగోతం వెలుగులోకి రావడంతో ఇందుకు బాధ్యులైన మార్కెట్ కమిటీ కార్యదర్శులపై రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కొరడా ఝుళిపించింది. ఇందుకు బాధ్యులైన ఏడుగురు మార్కెట్ కమిటీ కార్యదర్శులపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు సస్పెన్షన్ వేటు వేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో నకిలీ టీఆర్‌ల వ్యవహారం విజిలెన్సు విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో భద్రాచలం మార్కెట్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్.శ్రీనివాసరావుపై సస్పెన్షన్ వేటు వేయగా ఆయన స్థానంలో మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శిగా డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ ఆఫీసర్(డీఎంవో) నరేందర్‌ను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

విజిలెన్సు విచారణతో వెలుగులోకి....

సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్తి కొనుగోళ్లకు రైతుల పేరిట నకిలీ టీఆర్‌లను అశ్వాపురం మండలంలోని వ్యవసాయ శాఖకు చెందిన ఒక ఏఈవో నకిలీ జిరాక్సులతో కమీషన్లను దండుకొని రైతులకు వ్యాపారులకు ఇష్టానుసారంగా జారీ చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ క్రమంలో (మిగతా 4వ పేజీలో)



దుకాణం ఎదుట గుమిగూడిన బాధితులు

రోదిస్తున్న అప్పు ఇచ్చిన మహిళ

వడ్డీల ఎర వేసి..

- రూ.3 కోట్లు అప్పులు చేసిన ఇద్దరు వ్యాపారులు
- నష్టాల కారణంతో చెల్లించలేమని 80మందికి నోటీసులు
- ఆందోళనకు దిగిన బాధితులు
- మణుగూరులో కలకలం

మణుగూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వడ్డీల ఎర వేశారు. దొరికిన కాడల్లా అప్పులు చేశారు. చివరకు అప్పులు చెల్లించలేమంటూ నోటీసులు పంపారు. దీంతో అప్పులిచ్చిన వారు లబోదిబోమంటూ ఆందోళనకు దిగారు. ఈ సంఘటన బుధవారం మణుగూరులో చోటుచేసుకుంది. ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా రూ.3 కోట్ల మేర అప్పులు చేసి, ఇప్పుడు వాటిని ఇవ్వలేమంటూ.. ఇద్దరు సోదరులు లీగల్ నోటీసులు పంపడం సంచలనం రేపుతోంది. మణుగూరులో గీదా రామ్, లక్ష్మణ్ అనే ఇద్దరు వ్యక్తులు సోదరులు. వీరు పట్టణంలో లక్ష్మీశ్రీనివాస కిరాణ, జనరల్ స్టోర్స్ నడుపుతున్నారు.

ఈ క్రమంలో వ్యాపార అభివృద్ధి ఇంటి నిర్మాణ ఖర్చుల పేరుతో గత ఐదేళ్ల నుంచి బంధువులు, స్నేహితులు, తెలిసిన వారు, సాటి వ్యాపారుల నుంచి లక్షల్లో అప్పులు చేశారు. పట్టణంలో స్థిరపడిన వ్యాపారులు కావడంతో అందరూ నమ్మకంతో అప్పులిచ్చారు. కొంతకాలం వడ్డీలు సక్రమంగా చెల్లించినా, ఆ తర్వాత వాయిదాలు వేస్తూ కాలం వెళ్లదీయడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో అసలు, వడ్డీల కోసం అప్పులిచ్చిన వారు ఒత్తిడి చేయడం ప్రారంభించారు. దీంతో రామ్ లక్ష్మణ్ సోదరులు ఓ న్యాయవాది ద్వారా 80 మందికి (మిగతా 4వ పేజీలో)

రంగరాజన్‌పై దాడి కేసులో ఇద్దరి అరెస్టు?

భద్రాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి సంఘటనలో ఇద్దరు వ్యక్తులను సైబరాబాద్ పోలీసులు భద్రాచలంలో బుధవారం అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన ఈ సంఘటనలో మొత్తం 15 మంది పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ క్రమంలో వారి గురించి అన్వేషిస్తుండగా ఇరువురు ఏపీలోని అల్లూరి జిల్లా వరరామచంద్రాపురం మండలానికి చెందిన వీరిని భద్రాచలంలో అదుపులోకి తీసుకొని విచారించి హైదరాబాద్‌కు తరలించినట్లు తెలుస్తోంది. వీరి వివరాలను పోలీసు వర్గాలు బహిర్గతం చేయడం లేదు.



జన్మభూమి రుణం తీర్చుకునేందుకు..

- ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్త
- గ్రామం మొత్తం సిమెంట్ రోడ్ల నిర్మాణం, పాఠశాల అభివృద్ధి
- నోస్ ల్యాబ్స్ అధినేత సత్యనారాయణరెడ్డి సేవా కార్యక్రమాలు

నిండాముంచిన నిర్లక్ష్యం

- జేఈఈ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల వెనుకంజ
- 158 మంది గురుకుల విద్యార్థుల్లో.. 14 మందే అర్హత
- ప్రభుత్వ కళాశాలల నుంచి పరీక్షకు హాజరుకాని విద్యార్థులు

JEE (Main)
Joint Entrance Examination

నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం

- ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో నిలిచిన క్యాథ్‌లాబ్ సేవలు
- పవర్ ప్యానెల్ బోర్డులో అంతరాయం
- నిరాశగా వెనుదిరుగుతున్న గుండె సంబంధిత రోగులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని తర్వాత ఖమ్మం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో గుండె సంబంధిత వైద్యసేవలు అందించే కీలక విభాగం అది. క్యాథ్‌ల్యాబ్.. రూ 10 కోట్లతో ఏర్పాటు చేసిన అత్యంత ఖరీదైన యంత్రం అది... కానీ ఆస్పత్రి అధికారుల అలక్ష్యం కారణంగా దాని సేవలు మరుగున పడ్డాయి. గత శనివారం నుంచి విద్యుత్ సరఫరా లేక మూలనపడింది. దీంతో గుండెకు స్టంట్లు, యాంజియోగ్రామ్ చేపించుకునేందుకు వచ్చిన 10 మంది రోగులు నిరాశగా వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. కేవలం రూ.15వేలతో మరమ్మతులు చేయించడంలో అధికారులు అలక్ష్యం చేయడంతో ఈ పరిస్థితి తలెత్తినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఆస్పత్రిలో గత నాలుగేళ్ల క్రితం గుండె సంబంధిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

హైదరాబాద్‌లోనే కార్పొరేట్ వైద్యశాలల్లో ఉండే గుండె సంబంధిత వ్యాధులను నిర్ధారించే 'క్యాథ్‌లాబ్'ను ఖమ్మం ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. రూ.10కోట్ల వ్యయంతో దీన్ని ఏర్పాటు చేశారు. కానీ గత శనివారం నుంచి క్యాథ్‌లాబ్ మూలనపడింది. దీనికి అనుసంధానంగా ఉన్న పవర్ ప్యానెల్ బోర్డులో సాంకేతిక లోపం తలెత్తింది. దీనికి కేవలం రూ.15 నుంచి రూ.20వేల ఖర్చు చేస్తే బాగుపడుతుందని నిపుణులు అంటున్నారు. కానీ ఆస్పత్రిని పర్యవేక్షించే అధికారులు అత్యవసరానికి వినియోగించే చిన్న చిన్న లోపాలు సరిచేసేందుకు కావాల్సిన డబ్బులను కూడా (మిగతా 4వ పేజీలో)



ఖమ్మం జిల్లా ఆస్పత్రిలోని క్యాథ్‌లాబ్



బీజేపీ కార్యాలయం వద్ద ఇరువర్గాల మధ్య వాగ్వాదం

సత్తుపల్లిలో ఉద్రిక్తత

- బీజేపీ కార్యాలయం వద్దకు ఎన్ఎస్‌యూఐ నాయకుల రాక
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం.. కొద్దిసేపు ఉద్రిక్తత
- తమపై దాడికి యత్నించారంటూ బీజేపీ నాయకుల నిరసన
- వాట్సాప్‌లో చాటింగ్‌లే కారణమని ప్రచారం



అప్పుడే పరేషాన్

- భయపెడుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- కొత్తగూడెంలో 35 డిగ్రీల నమోదు
- రాత్రి వేళ వణికిస్తున్న చలి తీవ్రత

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి మొదటి వారంలోనే పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికమవుతోంది. ఎండలు ఇప్పుడే ఇలా మండితే ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా (మిగతా 4వ పేజీలో)

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు భారీ ఏర్పాట్లు చేయాలి

సింగరేణి జీఎం పర్సనల్ కవితానాయుడు


మాట్లాడుతున్న కవితానాయుడు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్న కోల్ ఇండియా జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలను కొత్తగూడెం ప్రకాశంస్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్టు సింగరేణి జీఎం (పర్సనల్) కవితానాయుడు తెలిపారు. జాతీయస్థాయిలో నిర్వహించే అథ్లెటిక్స్ పోటీలకు భారీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో అథ్లెటిక్స్ పోటీల ఏర్పాట్లపై వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న పది బొగ్గు రంగాలకు సంబంధించిన క్రీడాకారులు ఈ పోటీలకు హాజరుకానున్నట్టు తెలిపారు. జాతీయస్థాయిలో నిర్వహించే ఈ పోటీలకు సింగరేణి సంస్థ వేదిక కానుందని క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో అధికారులు దామోదర్‌రావు, రాజేంద్ర ప్రసాద్, రాజశేఖర్, నాగరాజు, వేణుమాధవ్, రామశేషయ్య, డేవిడ్, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

రైల్వే జోన్ మార్పుతోనైనా.. మధిరలో మరిన్ని రైళ్లు ఆగేనా?

ఒక వైపు రైళ్లు ఆపాలంటుంటే.. ఆగే వాటిని ఎత్తేస్తున్నారు..



మధిరటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకు సికింద్రాబాద్ కేంద్రంగా ఉండే సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉన్న మధిర ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం వైజాగ్ కేంద్రంగా కొత్త రైల్వే జోన్‌ను ప్రకటించడంతో తెలంగాణలోని మధిర, ఎర్రుపాలెం, మోటమర్రి స్టేషన్‌లను విశాఖ కేంద్రంగా పనిచేసే సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌లోని విజయవాడ డివిజన్‌లో వీటిని కలిపారు. మధిర చుట్టు ప్రక్కల తెలంగాణతోపాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌తో కలుపుకొని దాదాపు 60 గ్రామాల ప్రజలు మధిర రైల్వే స్టేషన్ నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఖమ్మం జిల్లాలో కూడా ఖమ్మం తరువాత మధిరనే అతి పెద్ద రైల్వేస్టేషన్‌గా ఉంది. ఇక్కడ కాటన్ ఇండస్ట్రీస్‌తోపాటు పెద్ద సంఖ్యలో కోల్డ్‌స్టోరేజీలు ఉండటంతో ఇక్కడ నుంచి అహ్మదాబాద్, లక్నో, వారణాసి, ఢిల్లీ, నాగపూర్ నుంచి వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కొవిడ్ సమయంలో ప్రయాణాలు తగ్గాయని మధిర రైల్వే స్టేషన్‌లో ఆగే రైళ్లను ఒక్కొక్కటిగా ఎత్తివేశారు. మధిరలో నవజీవన్, ఈస్ట్‌కోస్ట్, జీటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ఎన్నో ఏళ్లగా మధిర ప్రాంత ప్రజలు కోరుతుంటే రైళ్ల ఆపటం అటుంచి ఉన్న రైళ్లను ఎత్తివేస్తున్నారు. మధిరలో ఆగే గౌతమి, సింహపురి, లింక్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు పెద్దపల్లి డెమో ప్యాసింజర్లకు మధిరలో పూర్తిగా హాల్టింగ్ ఎత్తివేశారు. మహబూబ్‌నగర్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లకు సికింద్రాబాద్ వెళ్లేటప్పుడు హాల్ట్‌లను ఎత్తివేసి విజయవాడ వైపు వెళ్లేటప్పుడు మాత్రమే హాల్టింగ్ ఇచ్చారు. రైళ్ల హాల్టింగ్‌తోపాటు, మధిర పాత రైల్వే గేట్ వద్ద ఖమ్మంలో సారధినగర్‌లో నిర్మించినట్టు అండర్ బ్రిడ్జిని నిర్మించాలని ఎప్పటినుంచో ఇక్కడి ప్రజలు కోరడమే కాకుండా అనేకసార్లు రైల్వే డీఆర్‌ఎంలకు, ఎంపీలకు వినతిపత్రం ఇచ్చినా.. చూస్తాం చేస్తాం అన్నారే కాని సమస్యకు పరిష్కారం లభించలేదు. విజయవాడ డివిజన్‌లోని చివరి ఇంటర్ ఛేంజ్ స్టేషన్ ఖమ్మం జిల్లాలోని మోటమర్రి స్టేషన్ కావడంతోపాటు ఈ స్టేషన్లు అన్ని విజయవాడకు దగ్గరలో ఉండటంతో ఇకనైనా మధిరలో రైళ్ల హాల్టింగ్‌పై రైల్వే అధికారులు దృష్టిపెట్టి మధిరలో గతంలో ఆగిన రైళ్లను పునరుద్ధరించి కొత్తగా మరికొన్ని రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుచున్నారు.

మరిన్ని రైళ్లను ఆపాలి

పుతుంబాక కృష్ణప్రసాద్, రైలు, బస్సు ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు



గతంలో ఉన్న సికింద్రాబాద్ డివిజన్ కంటే విజయవాడ డివిజన్ మధిర, ఎర్రుపాలెం, మోటమర్రి స్టేషన్లకు చాలా దగ్గర. అధికారులు ఇక్కడి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే కాకుండా ఇక్కడికి వచ్చిపోవడం కూడా సులువు అవుతుంది. గతంలో హాల్టింగ్ ఎత్తివేసిన రైళ్లకు తిరిగి మధిరలో హాల్టింగ్ కల్పించాలి. నవజీవన్, ఈస్ట్‌కోస్ట్, జీటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా కొత్తగా హాల్టింగ్ ఇవ్వాలి.


గద్దెల వద్దకు చేరుకున్న సారలమ్మ

నేడు గద్దెలపైకి సమ్మక్క

గద్దెలపై కొలువుదీరిన సారలమ్మ, పగిడిద్దరాజు

కరకగూడెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలంలోని చిరుమళ్ల సమ్మక్క, సారలమ్మ జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతోంది. మంగళవారం ప్రారంభమైన జాతర బుధవారం ఆలయ పూజారులు, వడ్డేలు చిరుమళ్లలో అత్యంత వైభవంగా సారలమ్మ, పగిడిద్దేరాజులకు ఎదురుకోలు నిర్వహించారు. అనంతరం డోలు వాయిద్యాలు, ఆదివాసీ సంప్రదాయాలతో ఆలయం వద్ద గద్దెలపై సారలమ్మను, పగిడిద్దేరాజును కొలువు తీర్చారు. గురువారం తల్లిదేవత సమ్మక్కను మధ్యాహ్నం 1:30 సమయంలో మార్గంమధ్యలో ఎదురుకోలు నిర్వహించి గద్దెలపై కొలువు తీర్చుతారు. రాత్రి 1:30 గంటలకు పగిడిద్దేరాజుకు, సమ్మక్కతో కల్యాణం నిర్వహిస్తారు. తెలంగాణ, ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వచ్చే భక్తులు వనదేవతలను దర్శించుకోనున్నారు. వనదేవతలను తీసుకొచ్చేందుకు ఆలయ పూజారులు, అధికారులు ప్రత్యేకఏర్పాట్లు చేశారు.

సత్తుపల్లిలో ఉద్రిక్తత

సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎస్‌యూఐ నాయకులు కొందరు బుధవారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని బీజేపీ కార్యాలయంపై దాడికి యత్నించారు. వేంసూర్ రోడ్‌లో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం పెరిగి అరగంటసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఇరువైపులా కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసుల రాకతో ఆందోళన ఆగిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి....

రాహుల్‌గాంధీ పర్యటన రద్దు జరిగిందనే విషయాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీను సోషల్ మీడియాలో పోస్టు పెట్టగా.. ఉదయం నుంచి ఇరువర్గాల మధ్య ఫోన్‌లో చాటింగ్‌లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సాయంత్రం బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ సమావేశం జరుగుతున్న సమయంలో ఎన్‌ఎస్‌యూఐ సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు అర్వపల్లి సందీప్ ఎగౌడ్, ప్రశాంత్ మరో ముగ్గురు వ్యక్తులు బీజేపీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరగ్గా, తమపై దాడికి వచ్చారంటూ బీజేపీ నాయకులు రహదారిపై బైఠాయించి రాస్తారోకోకు దిగారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ కిరణ్ అక్కడికి చేరుకుని అయిదుగురిని పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో ఆందోళన సద్దుమణిగింది.

ఇది కాంగ్రెస్ కార్యకర్తల పనే..

బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అని చెప్పుకుంటున్న అయిదుగురు తమ పార్టీ కార్యాలయంపై దౌర్జన్యానికి దిగారన్నారు. రాహుల్‌గాంధీపై పెట్టిన పోస్టులకు, నరేంద్ర మోదీపై పెట్టిన పోస్టులపై నచ్చకపోతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అలాకాదని దౌర్జన్యాలకు దిగడం సరికాదన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో అరాచకం పెరిగిపోతుందని, తమపైకి ఎమ్మెల్యే పంపారా, లేక వాళ్లే వచ్చారా తేలాల్సి ఉందన్నారు. ఇదే విషయమై సత్తుపల్లి పోలీసులతోపాటు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ఫిర్యాదు చేశామని నంబూరి తెలిపారు.


రామేశ్వరం-ద్వారక జట్ల మధ్య జరుగుతున్న పోటీ దృశ్యం

ఫైనల్స్‌కు అణుశక్తి క్రీడా పోటీలు

అశ్వాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలో ఈనెల 10న ప్రారంభమైన భారత అణుశక్తి విభాగం 39వ క్రీడా పోటీలు ఫైనల్ దశకు చేరుకున్నాయి. బుధవారం గౌతమీనగర్ కాలనీలోని రీక్రియేషన్ క్లబ్‌లో సెమీఫైనల్ పోటీలు జరిగాయి. పురుషల ఛాంపియన్‌షిప్ విభాగంలో జరిగిన సెమీఫైనల్‌లో మొదటగా రామేశ్వరమ్-ద్వారక జట్లు పోటీపడగా రామేశ్వరమ్ 3-1తో విజయం సాధించింది. అజంతా-గోల్కొండ జట్ల మధ్య జరిగిన పోటీలో అజంతా జట్టు 3-2తో గెలుపొందింది. వెటరన్స్ విభాగంలో ఎల్లోరా-రామేశ్వరం జట్ల మధ్య జరిగిన పోటీలో ఎల్లోరా 2-0, ద్వారక-అజంతా జట్ల మధ్య జరిగిన పోటీలో ద్వారక 2-0 తో విజయం సాధించాయి. మహిళా విభాగంలో అజంతా-రామేశ్వరమ్ జట్ల మధ్య జరిగిన పోటీలో అజంతా 2-0, ఎల్లోరా-నాగార్జున జట్ల మధ్య జరిగిన పోటీలో ఎల్లోరా జట్టు 2-0తేడాతో విజయం సాధించి ఫైనల్లోకి ప్రవేశించాయి. ఫైనల్ పోటీలు గురువారం జరుగనున్నాయి.

నిరుద్యోగ యువత అవకాశాలను

అందిపుచ్చుకోవాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్


ప్రసంగిస్తున్న ఐటీడీఏ పీవో

భద్రాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన నిరుద్యోగ యువత తమకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏలో బుధవారం వైటీసీ భవనంలో నిరుద్యోగ గిరిజన యువతకు నిర్వహించిన కౌన్సెలింగ్, ఉపాధి కల్పనలో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువతీయువకులు చెడు భావాలను మనసులో నుంచి తీసేసి మార్పు చెంది వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. పీజీ, బీటెక్ చేసిన యువత స్కిల్స్‌ను మెరుగుపర్చుకోవాలని ప్రభుత్వ ఉద్యోగం అనేది ఈ పోటీ ప్రపంచంలో సాధించాలంటే ఎంతో శ్రమించాలని, అందుకు ప్రతీ ఒక్కరు ఐటీడీఏ భవిత సెల్ ద్వారా నిర్వహించే శిక్షణలో తర్ఫీదు పొందాలన్నారు. అనంతరం వివిధ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఉద్యోగ మేళాలో 86 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోగా 39మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజు, జేడెం హరికృష్ణ పాల్గొన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో రాహుల్ మ్యూజియం కమిటీ సభ్యులతో కలిసి గిరిజన మ్యూజియాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

వడ్డీల ఎర వేసి..

(3వ పేజీ తరువాయి)

మంగళవారం లీగల్ నోటీసులు ఇప్పించారు. కరోనా కాలంలో వ్యాపారంలో పూర్తిగా నష్టపోయామని, తాము తీసుకున్న అప్పులను మరో పదేళ్ల తర్వాత చెల్లిస్తామని నోటీసుల్లోపేర్కొన్నారు. వీటిని చూసిన రుణదాతలు లబోదిబోమంటూ బుధవారం లక్ష్మీశ్రీనివాస షాపునకు చేరుకున్నారు. అప్పులు తీసుకుని ఇంత మోసానికి పాల్పడతారా అని రామలక్ష్మణ్‌లను నిలదీశారు. దీంతో వారిద్దరూ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. బాధితులు వారి షాపులకు తాళాలు వేసి ఆందోళన చేపట్టారు. కాయకష్టం చేసి పోగు చేసుకున్న డబ్బును నమ్మకంతో ఇస్తే అన్నదమ్ములిద్దరూ మొదటికే మోసం చేశారని సుధాకర్, జెట్టి సరోజిని, శేషగిరిరావు, మేడ నాగేంద్ర, మేడా శ్రీనివాస్ తదితరులు ఆవేదన చెందారు.

ఇదిలావుండగా వడ్డీల ఎర వేసి రామ్‌లక్ష్మణ్ సోదరులు ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు, రూ.7లక్షలు, రూ.11లక్షలు.. ఇలా రకరకాల మొత్తాల్లో అప్పులు చేసినట్టు తెలిసింది. కొందరు రూ.25లక్షలు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. అన్నదమ్ములు కావాలని తమ అప్పులు ఎగ్గొట్టేందుకు నాటకం ఆడుతున్నారని బాధితులు చెబుతున్నారు. ఖమ్మం, వీఆర్‌పురం మండలం, రాయగూడెం, మహబూబాబాద్ వంటి ప్రాంతాల్లో ప్లాట్లు కొన్నారని, పట్టణంలో స్థిరాస్తులు కూడబెట్టుకున్నారని తెలిపారు. అంతేగాక ఈ కుట్రలో రామ్‌లక్ష్మణ్‌ల బంధువు అయిన గిన్నెల కొట్టు యజమాని పాత్ర కూడా ఉందని ఆరోపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బాధితుల దుకాణం ముందు పడిగాపులు కాసినా అన్నదమ్ములు బయటికి రా లేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని వెళ్లిపోయారు. ఈ విషయంపై మణుగూరు సీఐ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అప్పుడే పరేషాన్

(3వ పేజీ తరువాయి)



కొత్తగూడెం పట్టణంలో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాత్రి సమయంలో చలితీవ్రత అధికంగ ఉన్నప్పటికి పగటి పూట ఎండల తీవ్రత అధికంగా నమోదు అవుతుండటంతో రాత్రి చలికి.. మధ్యాహ్నం ఎండలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు శీతలపానియాల వైపు మొగ్గు చూపుతుండటంతో శీతల పానీయాల ధరలు పెరిగిపోతున్నాయి.

మొన్నటి వరకు రూ.30 పలికిన కొబ్బరి బొండం ధర రూ.50కు పెరగడం గమనార్హం. చెరుకు రసాలు, పండ్ల రసాలు గ్లాసుకు రూ.20 నుంచి రూ.30 ధర పలుకుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు, ఇల్లెందు, పాల్వంచ తదితర పారిశ్రామికపట్టణాల్లో సైతం పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలుగా నమోదు అవుతున్నట్లు వాతావరణశాఖ తెలుపుతోంది. వాతావరణంలో సమతూల్యం లోపించడం కారణంగ ఎండ తీవ్రత పెరుగుతుందని పర్యావరణ వేత్తలు వ్యాఖ్యానిస్తోన్నారు. ప్రధానంగా జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు పరిధిలోని సింగరేణి ఓపెన్‌కాస్టుల సమీపంలో చెట్లన్నీ నరికివేయడంతో ఆ ప్రాంతాల్లో మరింత ఉష్ణోగ్రతలు అధికమవుతున్నట్లు తెలుస్తోంది.

మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటం వల్ల ప్రజలు రోడ్లపైకి రాకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తోన్న పరిస్థితి పట్టణంలో నెలకొంది. వేసవి ఎండలు పెరుగుతుండటంతో సింగరేణి యాజమాన్యం సైతం కార్మికులకు చలువపందిళ్ల వేసే విధంగా చర్యలు చేపట్టాలని కార్మికసంఘాల నాయకులు డిమాండ్ చేస్తోన్నారు. ఇప్పటికే సింగరేణి యాజమాన్యం మొదటి షిఫ్టును 5గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్మికులు విధులు నిర్వహించే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం

(3వ పేజీ తరువాయి)

వినియోగించకుండా మరమ్మతులు చేపట్టడంలో అలక్ష్యంగా వ్యవహరించడంతో ఐదు రోజులుగా క్యాథ్‌లాబ్ సేవలు మూలనపడ్డాయి. ఇప్పటికే ఇక్కడ వార్డులో ముగ్గురు రోగులు ఇన్‌పేషెంట్లుగా ఉన్నారు. మరో ముగ్గురు యాంజియోగ్రామ్ కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. మరో ఇద్దరు గుండెకు స్టంట్ వేయించుకునేందుకు నమోదై ఉన్నారు. క్యాథ్‌లాబ్ పనిచేయని కారణంగా రోగులను తిప్పి పంపుతున్నట్లు సమాచారం. ఇక్కడ పని చేసే సిబ్బంది కూడా ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది.

క్యాథ్‌లాబ్‌కు మాత్రం తాళాలు పెట్టి మూసేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్యాథ్‌లాబ్‌కు పవర్ ప్యానెల్ బోర్డులో లోపానికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మోక్షం ఎన్నడు!?

(3వ పేజీ తరువాయి)

అంచనాలు రూ.19వేల కోట్లకు చేరగా, ఇప్పటికే రూ.9వేల కోట్ల వరకు ఖర్చుపెట్టారు. 2026 ఆగస్టు 15నాటికి మొత్తం ప్రాజెక్టు ఆయకట్టుకు నీరందించి విడుదల చేయాలని భావించి, ప్రస్తుతం మిగిలిన మూడు ప్యాకేజీలకు టెండర్లు పిలిచి, సుమారు రూ.3వేల కోట్లతో డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు కూడా ప్రారంభింపచేశారు. అయితే ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సద్వినియోగించు కోవాలంటే కేంద్ర జలవనరుల శాఖ, కేంద్ర జలసంఘం సంబంధించి పూర్తిస్థాయి అనుమతులు పొందాల్సి ఉంది

17న ట్రిబ్యునల్‌లో వాదనలు

గోదావరి నదిపై దుమ్ముగూడెం ఆనకట్టకు సమీపంలోనే బహుళ ప్రయోజనాలతో నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బ్యారేజీకి కేంద్ర పర్యావరణశాఖ అనుమతులు లేవని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై కోర్టులో గిరిజన సంఘాల నాయకులు పిటీషన్ వేయడంతో పనులు ఆగిపోయాయి. తిరిగి పనులు ప్రారంభించేందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. ఇప్పటికే కేంద్ర అటవీశాఖ, ఆర్థికశాఖ అనుమతులను పొందారు. దుమ్ముగూడెం వద్ద 37 టీఎంసీల నీటి నిల్వ ఉంచి సీతారామ ఎత్తిపోతలకు పంపింగ్‌తో పాటు 320 మెగావాట్ల విద్యుదుత్పత్తి కోసం 2016 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. రూ.3426 కోట్లతో చేపట్టిన సీతమ్మసాగర్ బ్యారేజీకి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)నుంచి, రూరల్ ఎలక్ట్రిషియన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) ద్వారా రుణసాయం తీసుకున్నారు.

150ఏళ్ల క్రితం బ్రిటీష్ ప్రభుత్వంలో నావిగేషన్ కెనాల్ నిమిత్తం గోదావరిపై ఆనకట్ట నిర్మించారు. దీని సమీపంలోనే సీతమ్మసాగర్ బ్యారేజి 1263 మీటర్ల పొడవుతో నిర్మాణం జరుగుతోంది. బ్యారేజీ నిర్మాణం పూర్తయినా.. గేట్లు అమర్చాల్సి ఉంది. అయితే కేంద్ర పర్యావరణ అనుమతులు లేకపోవడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో వివాదం నడుస్తోంది. మరోవైపు కేంద్ర జలమంత్రిత్వశాఖ నుంచి అనుమతులు పొందాలి. వీటికోసం అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ జరిపితేనే కనీసం రెండు నెలల్లో అనుమతులు వచ్చే అవకాశం ఉంటుంది. లేకపోతే ఈ వేసవిలో పనులు పూర్తికాకపోతే మరో ఏడాది కాలం గడిచే అవకాశం ఉంది.

సర్వే పేరుతో వచ్చి దోచుకెళ్లారు..

(3వ పేజీ తరువాయి)

కాళ్లు, చేతులు బంధించారు. ప్రతిఘటించేందుకు ప్రయత్నించగా ఇద్దరు ఆగంతుకులు ఆమె ముఖంపై దుప్పటి వేసి పైన కూర్చొని పిడిగుద్దులు గుద్దారు.

మరో ఇద్దరు ఆగంతుకులు బీరువాలోని వస్తువులన్నీ చిందర వందర చేసి 18 తులాల బంగారు ఆభరణాలను చేజిక్కించుకున్నారు. వెంకట్రావమ్మ మెడలోని గొలుసు ఇతర వస్తువులను కూడా బలవంతంగా తీసుకున్నారు. ఆ తర్వాత బెడ్‌రూం బయట తలుపు గడియ పెట్టి వచ్చిన కారులో ఉడాయించారు. ఆ ఇంటికి సమీపంలోనే స్థానికంగా ఉన్న మధు విద్యాలయంలో ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్న వెంకట్రావమ్మ కోడలు లలిత మధ్యాహ్నం భోజనానికి ఇంటికొచ్చింది. ఆ సమయంలో ఇంటిముందు భాగంలోని తలుపులు తెరిచి ఉన్నాయి. బెడ్‌రూం గది తలుపుల గడియ పెట్టి ఉన్నప్పటికీ లోపలి నుంచి వెంకట్రావమ్మ మూలుగులు వినిపించడంతో గడియ తీసి లోపలకు వెళ్లి చూడగా మంచంపై బంధించి ఉన్న అత్త కన్పించింది. నోటికి, కాళ్లు, చేతులకు ఉన్న ప్లాస్టర్లను తొలగించగా జరిగిన ఈ విషయాన్ని వివరించింది. వెంటనే లలిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, సీఐ నున్నావత్ సాగర్, ఎస్ఐలు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ టీఆర్‌ల బాగోతం

(3వ పేజీ తరువాయి)

సీసీఐ అధికారులకు టీఆర్‌లపై అనుమానాలు రావడంతో వారు ఈ విషయంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ కమీషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో కమీషనర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఈ విషయంపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. దీంతో మణుగూరు ఏడీఏ తాతారావు ఆధ్వర్యంలో అశ్వాపురం ఏవో సాయిశంతన్‌కుమార్‌లను విచారణ అధికారిగా నియమించారు.

క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన అధికారులు నకిలీ టీఆర్‌లు ఉన్నట్లు గుర్తించి నకిలీ టీఆర్‌ల మంజూరుకు అశ్వాపురం మండలంలో పని చేస్తున్న ఒక ఏఈవోనే ప్రధాన సూత్రదారిగా తేల్చి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలోనే వరంగల్ రీజియన్ పరిధిలోని జిల్లాల్లో ఇదే రీతిలో విచారణ నిర్వహించగా అక్కడ సైతం నకిలీ టీఆర్‌ల డొంక కదిలింది. దీంతో ఒకేసారి ఏడుగురు మార్కెట్ కమిటీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేయడం గమనార్హం. ఇదిలా ఉండగా ఏఈవో స్థాయి అధికారి జారీ చేసిన పత్రాలు వాస్తవమైనవని భావించి మార్కెట్ కమిటీ కార్యదర్శులు సీసీఐకి సిఫార్సు చేసినట్లు పేర్కొంటున్నారు.

వైరస్‌తోనే బాయిలర్ కోళ్లు మృతి

కోళ్లఫామ్‌లను సందర్శించిన అధికారులు


పేరువంచలో రైతుతో మాట్లాడుతున్న జేడీఏ

కల్లూరు, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కల్లూరు మండలంలో ఫామ్‌లలో బాయిలర్ కోళ్లు వైరస్ వల్లే మృతిచెందాయని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి కె. వెంకటనారాయణ బుధవారం తెలిపారు. ఇటీవల కల్లూరు మండలంలో బాయిలర్ కోళ్లు వేలాదిగా చనిపోవడంతో కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో జేడీఏ, తహసీల్దార్ మండల పరిధిలోని నారాయణపురం, పేరువంచ గ్రామాల్లో గల బాయిలర్ కోళ్ల ఫామ్‌లను సందర్శించి పరిశీలించారు. జేడీఏ వెంకటనారయణ మాట్లాడుతూ ఇటీవల కల్లూరు, పెనుబల్లి తదితర ప్రాంతాల్లో ఫామ్‌లలో పెంచుతున్న కోళ్లు వాతవరణం, కొక్కెర, బ్యాక్టీరియా సంబవించి కోళ్లు మృతి చెందాయన్నారు. జిలాల్లో బర్డుఫ్లూ వ్యాధి లక్షణాలు లేవన్నారు. ఆంధ్రాలోని పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాప్తితో అక్కడ జిల్లా అధికారం యంత్రాంగంతో పాటుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడ పశుసంవర్ధక శాఖ తరుపున అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర సరిహద్దు ఆంధ్రాప్రాంతం నుంచి ఎలాంటి కోళ్లు, దాణ సరఫరా కాకుండ సరిహద్దుల వద్ద పశుసంవర్ధ, పోలీసు, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖలతో సమన్వయం చేస్తూ నిఘా ఏర్పాటు చేశామన్నారు. వైరస్‌తో మృతి చెందిన కోళ్లఫామ్ ప్రదేశాలను వారు క్షేత్ర స్థాయిలో సందర్శించి బాధిత రైతులకు ఫామ్‌లలో కోళ్ల పెంపకానికి గాను తిరిగి చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జగ్రత్తల గురించి జేడీఏ వెంకటనారాయణ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కోళ్ల ఫామ్‌ల పరిసరాల్లో ఇతర వ్యక్తులను లోపలకు అనుమతించ కూడదని, పశువైద్యులు నిర్ధారించిన దాణాను, వ్యాక్సినేషన్‌ను సకాలంలో చేయించాలని సూచించారు. నాణ్యమైన దాణాను ఆహారంగా వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లూరు పశువైద్యధికారి మమత, ఆర్ఐ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి రుణం తీర్చుకునేందుకు..

అభివృద్ధికి ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్త


పాఠశాలలో ఏర్పాటు చేసిన డెస్క్

వేంసూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తాను పుట్టి పెరిగిన గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఒక పారిశ్రామికవేత్త తన స్వగ్రామాన్ని దత్తత తీసుకున్నారు. వేంసూరు మండలం యర్రగుంటపాడు గ్రామానికి చెందిన డాక్టర్ భీమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి తన స్వగ్రామాన్ని రూ.కోట్లాది రూపాయల ఖర్చుతో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

నోస్ ల్యాబ్స్ అధినేత బీఎస్ఎన్ రెడ్డి

వేంసూరు మండలం యర్రగుంటపాడులో జన్మించిన డాక్టర్ సత్యనారాయణరెడ్డి యర్రగుంటపాడులో ప్రాథమిక విద్య, వేంసూరులో ఉన్నత పాఠశాలలో చదివారు. ఉన్నత విద్య హైదరాబాద్‌లో చదివిన ఆయన అక్కడే వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. హైదరాబాద్‌లో నోస్ ల్యాబ్స్ పేరుతో ఫార్మా కంపెనీ స్థాపించారు.

గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు...

గత మూడేళ్లుగా ఆయన స్వగ్రామం యర్రగుంటపాడులో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాలతో పాటు, నియోజకవర్గంలో కూడా తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. యర్రగుంటపాడులో మొత్తం రహదారులను సిమెంట్ రోడ్లుగా తీర్చిదిద్దారు. రోడ్ల పక్కన పూల మొక్కలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని పాఠశాలలో అన్ని తరగతి గదుల్లో విద్యార్థుల కోసం బెంచీలు, డెస్కులు ఏర్పాటు చేశారు. అదే పాఠశాలకు విద్యుత్ సౌకర్యం కోసం సోలార్ సిస్టం ఏర్పాటు చేశారు. గ్రామంలో పేదల ఇళ్లను గుర్తించి 80 ఇళ్లలో మరుగుదొడ్లను కట్టించి ఇచ్చారు. గ్రామంలోని దివ్యాంగుడు బొజ్జా పుల్లయ్యకు మూడు చక్రాల ఎలక్ట్రిక్ స్కూటీని అందజేశారు.

నియోజకర్గంలో...

సత్తుపల్లి నియోజకర్గంలోని పలు పాఠశాల్లో బెంచీలు, డెస్కులు అందజేశారు. మర్లపాడు జిల్లా పరిషత్తు పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి నిధులు అందజేశారు. వేంసూరు జడ్పీ హైస్కూల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిధులు అందజేశారు. యర్రగుంటపాడులో గ్రామస్థుల సహకారంతో రామాలయం నిర్మించారు. సేవా కార్యక్రమాల కోసం సొంత నిధులు కోట్లాది రూపాయలు ఖర్చు చేయటం పట్ల పలువురు ఆయనను అభినందిస్తున్నారు.



కొత్తగూడెంలో మాట్లాడుతున్న భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్

ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

» ఖమ్మం జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మశ్రీ

ఖమ్మం కలెక్టరేట్/ కొత్తగూడెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మశ్రీ అన్నారు. ఈ నెల 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో 4,089 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, వీరి కోసం 24 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని అన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఫిబ్రవరి 13న ముగుస్తుందని, పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు గురువారం వరకు తెలుస్తాయన్నారు. అంతకు ముందు మాస్టర్ ట్రైనర్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, జిల్లా ఉపాధికల్పన అధికారి మాధవి పోలింగ్ నిర్వహణపై వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ

కొత్తగూడెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులను మొదటి విడతగా ఈ నెల 13వ తేదీ కొత్తగూడెంలోని జడ్పీహెచ్ఎస్ ఆనందఖని మార్వాడి క్యాంపులో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి తెలిపారు.

పరిషత్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి..

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పక్షపాత ధోరణికి అవకాశం ఇవ్వొద్దని. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. కొత్తగూడెం జిల్లాలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యుల రెండో సాధారణ నిర్వహణ కొరకు ఆర్‌వో, ఏఆర్‌వోలకు బుధవారం ఉదయం ఐడీఓసీ పాల్వంచ సమావేశ మందిరంలో శిక్షణా తరగతులను జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ ప్రారంభించారు.



అంగన్‌వాడీలకు అద్దె కష్టాలు !

» నాలుగు నెలలుగా పెండింగ్‌లో అద్దెలు

» రూ. 60లక్షల72వేలు అద్దె బకాయిలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 12: (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికంగా అద్దెభవనాల్లోనే ఉన్నాయి. వీటికి సంబంధించి గత నాలుగు నెలలుగా అద్దెలు రాక పోవడంతో అంగన్‌వాడీ టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మొత్తం 1,840 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వాటిలో 465 అద్దె భవనాలలో ఉన్నాయి. 2024 మార్చినుంచి అద్దెలు బకాలయిలుండగా గత వారంలో ఐదు నెలలకు సంబంధించి బకాయిలు రూ. 79లక్ష24వేల 350ను ప్రభుత్వం విడుదల చేసింది. మిగిలిన నాలుగునెలలకు సంబంధించి రూ.60లక్షల72వేలను విడుదల చేయకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లను అద్దెభవన యజమానులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా ఖమ్మంఅర్బన్ ప్రాజెక్టులోని అద్దెభవనాల యజమానులు అంగన్‌వాడీ టీచర్లను అద్దె విషయమైపలుమార్లు వివాదాలు కూడా చోటుచేసుకున్నాయి. దీంతో టీచర్లువారిసొంత డబ్బులను యజమానులకు చెల్లించి అంగన్‌వాడీ సెంటర్ల కేంద్రాలను మార్చిన దాఖలాలుకూడా ఉన్నాయి. సొంతభవనాలు లేక అద్దెభవనాల్లోనే కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం ఏరోజు ఏ ఇంటిలో ఉంటుందో తెలియని పరిస్థితి. సకాలంలో అద్దె సొమ్ము అందించకపోవడంతో ఇంటియజమానులు అంగన్‌వాడీ టీచర్లపై వత్తిడి తెస్తున్నారు.

ఆలస్యమవుతున్న అద్దెలు...

జిల్లాలోని ఏడు ప్రాజెక్టుల పరిధిలో కొన్ని ప్రాజెక్టులలో ఈనాలుగు నెలలకు సంబంధించిన బిల్లులు సకాలంలో చేయకపోవడంతోనే బిల్లులు ఆలస్యమయ్యాయని విమర్శలున్నాయి. జిల్లాలో కల్లూరు, కామేపల్లి, ఖమ్మంరూరల్, ఖమ్మంఅర్బన్, మధిర, సత్తుపల్లి, తిరుమలాయపాలెం ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 1840 అంగన్‌వాడీ కేద్రాలున్నాయి. వీటిలో గర్భిణులు 6,562, బాలింతలు 5,918, ఏడునెలలనుంచి మూడేళ్లలోపు చిన్నారులు 35,733, మూడేళ్లనుంచి ఆరేళ్లలోపుచిన్నారులు 30,328 మంది ఉన్నారు. వీరందరికి సంబంధించిన వివరాలను సకాలంలో బిల్లులుచెల్లిపు విషయంలో ఉన్నతాధికారులకు అందించకపోవడంతోనే అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలు ఆలస్యం అవుతోంది. వాస్తవానికి అంగన్‌వాడీ కేద్రానికి ప్రభుత్వం అందించే అద్దె అతితక్కువగా ఉండడంతో నగరాలు, పట్టణాల్లో భవనాలు దొరకడం కష్టంగా మారింది. ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో రూ.5వేలు,గ్రామాలలో రూ.2500లు అద్దెలు చెల్లించడంతో ఈడబ్బులకు భవనాలు దొరకడం కష్టంగా మారింది. అంవగన్‌వాడీ కేంద్రం నిర్వాహణకు విద్యకు రెండుగదులు, వంటగది, మూత్రశాల, చిన్నారులు ఆడుకునేందుకు ఆటస్థలం ఉండాల్సి ఉండగా ప్రభుత్వం చెల్లించే అద్దెలకు కేవలం ఒకటి, రెండుగదులున్నా ఇళ్లే అధికంగా ఉన్నాయి. వీటిలో ఎక్కడా కూడా ఆటస్థలం,మూత్రశాలలు, కొన్ని కేంద్రాలకు విద్యుత్ కూడా అందుబాటులో లేదు. వీటితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు చెల్లించాల్సిన గ్యాస్,కూరగాయల బిల్లులు కూడా ప్రభుత్వం గత 8నెలలగా చెల్లించలేదదని తెలుస్తుంది.

ప్రభుత్వానికి నివేదికపంపించాం

రాంగోపాల్‌రెడ్డి, జిల్లా మహిళ, శిశుసంక్షేమశాఖ అధికారి



జిల్లాలో గత నాలుగు నెలలుగా రావాల్సిన అద్దెభవనాల అద్దెలకు సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. ఈనెలాఖరుకు అద్దెలు అందుతాయి. జిల్లాలో ఇప్పటి వరకు అన్ని అద్దెభవనాలకు సకాలంలోనే అద్దెలు చెల్లిస్తున్నాం .



మాట్లాడుతున్న సరోత్తంరెడ్డి

మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలి

» టీపీయూఎస్ బలపరిచిన బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి

ఖమ్మం బైపాస్‌రోడ్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని టీపీయూఎస్ బలపరిచిన బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి కోరారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 140 కోట్ల మంది దేశ ప్రజలకు మోదీ అభివృద్ధి పలాలు అందిస్తూ అవినీతికి ఆస్కారం లేకుండా స్వచ్ఛమైన పాలన అందిస్తున్నారని, అలాంటిపార్టీ తరుపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం రావడం అదృష్టమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు దొందుదొందులా వ్యవహరిస్తున్నారని, వారు అధికారంలో ఉన్నప్పుడు వీరికి సాయం చేయడం, వీరు అధికారంలో ఉన్నప్పుడు వారికి సహాయం చేసుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, కార్పొరేటర్ సత్యనారాయణ, శీలం పాపారావు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలో అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు అనాథ మృతదేహాలకు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల మార్చురిలో ఉన్న ఇద్దరి మృతదేహాల కోసం ఎవరు రాలేదు. దీంతో ఓపీ పోలీసులు వైద్యశాల సిబ్బంది సమక్షంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుకు అప్పగించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైన్‌షాపు ముందు బైక్‌లు ఎక్కువగా నిలపటంతో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలు అయిన సంఘటన బుధవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. నగరానికి చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి వైన్‌షాపు నుంచి బండితీసుకొని వెళతుండగా వెనుకనుంచి మరో ద్విచక్ర వాహనం వచ్చి ఢీ కొట్టింది. దీంతో ఇరువురుకి స్వల్ప గాయాలైయ్యాయి. ఇద్దరి మధ్య గొడవ జరగటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

1104 యూనియన్ పోరాటాలు చిరస్మరణీయం

» యూనియన్ నాయకుల ఉద్ఘాటన » ఘనంగా సంఘం 75ఏళ్ల ఉత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రం నుంచి విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై 75 సంవత్సరాలుగా అనేక సమ్మెలు, ఉద్యమాలు, పోరాటాలు చేసి ఉద్యోగులకు భద్రతతో పాటుగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేయించిన ఘనత 1104 ఎంప్లాయిస్ యూనియన్‌కు దక్కిందని, ఇప్పుడు టీజీ ఎన్పీడీసీఎల్‌లో అనేక సంస్కరణలకు కారణమైందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తక్కెళ్లపల్లి శేషగిరిరావు పేర్కొన్నారు. 1104 విద్యుత్ ఎంప్లాయిస్ సంఘం 57ఏళ్ల ఉత్సవాలను బుధవారం ఖమ్మంలో ఉద్యోగులు, కార్మికుల మధ్య ఘనంగా నిర్వహించారు. రెడ్ షర్టులు ధరించిన ఉద్యోగులు ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి వైరా రోడ్డులోని సంఘం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జడ్పీ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర కార్యవర్గం నాయకులు పూలమాలలు వేశారు. సంఘం భవనంలో జెండావిష్కరణ చేసి బహిరంగ సభను నిర్వహించారు.

ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన 20మంది ఉద్యోగులను సన్మానించారు. ఎస్ఈ సురేందర్ పాల్గొని సంఘం నాయకులను అభినందించారు. ఉమ్మడి జిల్లా కార్యవర్గం రమణారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు, సీతారామయ్య, అదనపు కార్యదర్శి పీ సురేశ్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కిరీటచారి, శ్రీధర్, మంజుల పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తికి ఏడాది జైలు

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చెరుకూరి వెంకటేశ్వర్లు వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఒకరి మృతికి కారణమైన కేసులో సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పుచెప్పారు.

ముదిగొండకు చెందిన షేక్ మల్సూర్అలీ అక్టోబరు 10, 2015న బైక్‌పై వెళుతుండగా వెంకటగిరి క్రాస్‌రోడ్‌లో ఎదుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఆ ప్రమదంలో మల్సూర్అలీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కేసులో పోలీసులు విచారించి కోర్టులో చార్జిషీటు దాఖలుచేయగా కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వరుకు శిక్ష విధించారు.

క్వింటా మిర్చికి రూ.35వేలు చెల్లించాలి

» అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు



మార్కెట్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మిర్చిని క్వింటాలు రూ. 35 వేలకు కొనుగోలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెచ్చల రంగారెడ్డి, ఉప్పల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన వారు మాట్లాడారు. ఆరుగాలం కష్టించి అప్పులు చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా వ్యాపారులు సిండికేట్ గా మారి రైతులను నష్ట పరుస్తున్నారని ఆరోపించారు.

రైతు వద్ద కమీషన్ వ్యాపారులు 4 నుంచి 7 శాతం వరకు తీసుకొని రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం నాయకులు గుర్రం అచ్చయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవులవెంకటేశ్వర్లు, చంద్ర అరుణ, పాశం అప్పారావు, లక్ష్మణ్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ఈసంఘటన కొత్తగూడెం పోస్టాఫీస్ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కొత్తగూడెం పట్టణంలో కూలీ లైన్‌లో మహ్మద్ హం స్సేన్(35) వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. పదమూడేళ్ల క్రితం హసీనాతో వివాహం జరిగింది. గత రెండేళ్ల క్రితం నుంచి భార్య తనను విడిచి వెళ్లిపోయిందని తీవ్ర మనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి కుర్షీద్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ ఎస్ఐ మస్తాన్ తెలిపారు.

మరో ఘటనలో....

క్షణికావేశంతో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. త్రీటౌన్ ఎస్ఐ పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని నేతాజీ మార్కెట్‌కు చెందిన మౌర్య గోపాల్‌సింగ్(37) ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. భార్య, భర్తలు ఇంటి విషయాలపై గొడవ పడ్డారు. దీంతో మనస్థాపం చెంది ఈ నెల 10వ తేదీ తెల్లవారుజామున గోపాల్‌సింగ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతడిని వెంటనే కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి సోదరి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మార్చురీలోనే భార్యాభర్తల మృతదేహాలు

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో మంగళవారం రాత్రి సంచలనం సృష్టించిన వృద్ధ దంపతుల మృతదేహాలను ఇంకా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలోనే పోలీసులు భద్రపరిచారు. నగరంలోని బ్యాంకు కాలనీ సమీపంలోని వేణుగోపాల్‌నగర్‌లో నివాసం ఉంటున్న నర్సింహారావు, కోటమ్మలు మృతిచెందిన విషయం విధితమే. వీరి మృతదేహాలు కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు టుటౌన్ పోలీసులు ప్రయత్నిస్తున్నా, పూర్తిస్థాయిలో వారి వివరాలు అందుబాటులోకి రాలేదు. ఇంటిలో వారి ఆధార్‌కార్డులు కూడా లభించకపోవడతో పోలీసులు మృతుని ఫోన్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. అయినా పూర్తిస్థాయిలో వారి కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలు సమాచారం రాకపోవడంతో వారి మృతదేహాలకు ఇంకా మార్చురీలోనే ఉంచారు.

కాగా టుటౌన్ సీఐ బాలకృష్ణను వివరణ కోరగా వారి కుటుంబసభ్యుల వివరాలు సేకరించే పనిలో ఉన్నామని, వివరాలు తెలిసిన వెంటనే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. కాగా ఖమ్మం నగరంలో మృతి చెందిన నర్సింహారావు వంట మాస్టర్‌గా పని చేస్తున్న సమయంలో ఓ హోటల్ యాజమానికి సుమారు రూ.2.50వేలు నగదు ఇచ్చాడని, వాటితో పాటు మరికొంత మందికి నగదు ఇవ్వగా అవి తిరిగి రావడం లేదని సూసైడ్ నోట్‌లో రాసినట్లు పోలీస్‌శాఖలో ప్రచారం జరుగుతుంది. అందుకోసమే తన భార్యను హత్య చేసి తాను కూడా ఆత్మహత్య చేసుకున్నట్లు లేఖలో పేర్కొన్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

అశ్వాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతిర్యాల గ్రామానికి చెందిన సవలం హర్షవర్ధన్(20) గతనెల 31న మండల పరిధిలోని మల్లెలమడుగు జడ్పీహైస్కూల్ సమీపంలో బైక్ అదుపుతప్పిన సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భద్రాచలంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామానుజవరం గ్రామానికి చెందిన నడికొప్పుల సంపత్(25) తాపీ కూలీగా పని చేసుకుంటూ జీవించే వాడు. మంగళవారం రాత్రి పట్టణంలోని సురక్షా బస్టాండ్ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిండాముంచిన నిర్లక్ష్యం

» జేఈఈ పలితాల్లో ప్రభుత్వ కళాశాలలు వెనుకంజ

» 158మంది గురుకుల విద్యార్థుల్లో.. 14 మందే అర్హత

» 'ప్రైవేటు' సేవలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ?

» జేఈఈ సిలబస్ చెప్పలేని ప్రభుత్వ అధ్యాపకులు



ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మొదటి విడత జేఈఈ మెయిన్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలలు వెనకబడ్డాయి. జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలు, 14 బీసీ గురుకులాలు, 14 మైనారిటీ గురుకులాల నుంచి జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షకు మొత్తం 158మంది విద్యార్థులు హాజరుకాగా కేవలం 14మంది విద్యార్థులే అర్హత సాధించారు. మైనారిటీ గురుకులం నుంచి 78 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా కేవలం 9మంది మాత్రమే అర్హత సాధించారు. బీసీ గురుకులం నుంచి 80మంది పరీక్షకు హాజరుకాగా కేవలం ఐదుగురే అర్హత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి ఒక్క విద్యార్థి కూడా పరీక్షకు హాజరుకాలేదంటే సర్కార్ చదువుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఫలితాలను పరిశీలిస్తే అసలు జేఈఈ మెయిన్ సిలబస్ చేప్పే అధ్యాపకులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉన్నారా అనే సందేహం కలుగుతోంది.

జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయం పనితీరు అస్తవ్యస్తంగా తయారైంది. అసలు జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి ఎంతమంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరయ్యారనే వివరాలు కూడా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయంలో లేకపోవడం గమనార్హం. అసలు ప్రభుత్వ కళాశాలల్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో కొంతమంది సిబ్బంది కేవలం నెలవారీ జీతాలు తీసుకొని కాలక్షేపం చేయడం తప్ప ఎలాంటి పనులు చేయడంలేదని, దీనికి ఈ శాఖ అధికారి అంతాతానై ప్రైవేటు జూనియర్ కళాశాలలకు, అకాడమీలకు అనుకూలంగా వ్యవహరిస్తుండడమే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లోనూ కొన్ని కళాశాలలకు అనుకూలంగా సదరు అధికారి వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరగాల్సిన పరీక్షలు కెమెరాలు లేకుండానే ముగిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా తన సొంత నిర్ణయాలతో కొందరికి లబ్ధి చేకూర్చేలా అధికారి వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆదేశాలూ బేఖాతర్..

2024-25 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, గురుకులాల్లో ఉచిత ఎఫ్‌సెట్, నీట్, జేఈఈకి ప్రత్యేక శిక్షణ అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే చదువుతున్నారు. ప్రతిభ ఉన్నా సరైన ప్రోత్సాహం, శిక్షణ లేక వైద్య విద్య, ఇంజినీరింగ్ కోర్సులకు ఎంపిక కాలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్ది, వారి కలలు సాకారం చేసేలా ఇంటర్ బోర్డు కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సుమారు 4వేల మంది ఎంపీపీ, బైపీసీ విద్యార్థులకు ప్రైవేటుకు దీటుగా ఎంసెట్, నీట్, జేఈఈలకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి గత ఏడాది విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీపీ, బైపీసీ చదువుతున్న విద్యార్థుల వివరాలను సేకరించి విద్యార్థుల్లో ఉత్సాహవంతులైన వారిని ఎంపిక చేసి జిల్లాకేంద్రంలో ఒకేచోట శిక్షణ అందించాలని ఆదేశాలు జారీచేశారు. నిష్ణాతులైన అధ్యాపకులచే రెండు నెలల పాటు శిక్షణ అందించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం స్టడీ మెటీరియల్ సరఫరా సరఫరా చేస్తుంది.

కానీ జిల్లాలో ఎక్కడా ప్రత్యేక శిక్షణ అందించిన దాఖలాలు లేకపోవడంతో జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థులు రాణించలేకపోయారు. జేఈఈతో పాటు ఇంటర్ వార్షిక పరీక్షల్లో, ఎఫ్‌సెట్ తదితర పోటీ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల పరిస్థితి ఏమిటోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితికి ఇంటర్మీడియట్ కార్యాలయ అధికారి, కొందరు అధ్యాపకులే కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రైవేటుకు దీటుగా పలితాలు రాని ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకుంటే కొంతైనా మార్పు వస్తుందని విద్యార్థుల తల్లితండ్రులు అభిప్రాయపడుతున్నారు.

అనర్హులకు ప్రమోషన్లు..


ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో అర్హులకు ప్రమోషన్లు దక్కాల్సి ఉండగా అధికారుల అలసత్వం మూలంగా అనర్హులకు ప్రమోషన్లు దక్కుతున్నాయని కార్మికులు వాపోతున్నారు. సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఇటీవల పంపు ఆపరేటర్లకు ప్రమోషన్ల నిర్వహణ కోసం సింగరేణి అధికారులు రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఎలాంటి ప్రతిభ కనబర్చని కొంతమంది సీనియర్ కార్మికులకు అధికారులు ప్రమోషన్లు కట్టపెట్టినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇల్లెందు ఏరియాలోని ఇల్లెందు నుంచి కోయగూడెం ఓసీకి కొంతమందిని పంపు ఆపరేటర్లను ఇటీవల అధికారులు డిప్యూటేషన్‌పై పంపారు. వీరు డిప్యూటనేషన్‌లో ఉండగానే తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. అయినప్పటికీ డిప్యూటనేషన్లు రద్దుకాకపోగా డిప్యూటేషన్‌లో ఉన్న వారికి ప్రమోషన్లు కల్పించకుండా వేరే వ్యక్తికి ప్రమోషన్లు ఇచ్చి నిబంధనలను తుంగలో తొక్కినట్లుగా కార్మికులు ఆరోపిస్తున్నారు. పంపు ఆపరేటర్ల ప్రమోషన్లపై ఉన్నతాధికారులు తగిన విచారణ చేపట్టి న్యాయం చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనల ప్రకారమే.. పదోన్నతులు

● **డీజీఎం పర్సనల్ మోహన్‌రావు**

ఇల్లెందు ఏరియాలో నిబంధనల ప్రకారమే పంపు ఆపరేటర్లకు ప్రమోషన్లు కల్పించాం. సెలక్షన్ కమిటీ సూచనల ప్రకారం పదోన్నతులు ఇచ్చాం. నిబంధనలకు విరుద్ధంగా ఏమి జరగలేదు.

నేత్రపర్వంగా సహస్ర కలశాభిషేకం



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సహస్ర కలశాభిషేక మహోత్సవాలు వైభవోపేతంగా ముగిశాయి.. బుధవారం శ్రీ సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులకు మంజరి అద్ది పవిత్ర గోదావరి నదీ జలాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. 10న సహస్ర కలశాభిషేక మహోత్సవాలకు అంకురార్పణ నిర్వహించగా బుధవారం సహస్రకలశాభిషేకం నిర్వహించి యాగశాలలో హోమంకు పూర్ణాహుతి గావించడంతో మహోత్సవాలు ముగిసాయి. దీంతో గురువారం నుంచి ఆలయంలో నిర్వహించే నిత్య కల్యాణాలు పునరుద్ధరించనున్నారు. ఈ కార్య క్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవోలు శ్రవణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేశ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, అమరవాది శ్రీనివాస రామానుజం, అమరవాది మురళీకృష్ణమాచార్యులు, అర్చకులు అమరవాది వెంకట్రామన్ వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆధ్వర్యంలో రంగనాయకస్వామి కల్యాణం బుధవారం సాయంత్రం వైభవంగా జరిగింది. స్థానిక రంగనాయకుల గుట్టపై వేంచేసి ఉన్న శ్రీదేవి-భూదేవి సమేత రంగనాయకస్వామికి ధ్యాన మందిరంలో కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కాగా స్వామి వారి కల్యాణం సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తరపున కల్యాణమూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

» జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటనారాయణ

పెనుబల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటనారాయణ అన్నారు. బుధవారం ఏపీలో బర్డ్‌ఫ్లూ కలకలం రేపిన నేపథ్యంలో ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న పెనుబల్లి మండలం ముత్తగూడెం వద్ద పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. ఆంధ్రా నుంచి పెనుబల్లి, కల్లూరు మండలాలకు బాయిలర్ కోళ్లు, కోడిగ్రుడ్లు, బాతులతో వచ్చే వాహనాలను అనుమతించొద్దని ఆదేశించారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ లేదని అన్నారు. ఫారాల నిర్వాహకులను అప్రమత్తం చేశామని తెలిపారు. పెనుబల్లి పశువైద్యాధికారి సృజన, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైరస్‌లో కోళ్ల మృత్యువాతకు గురవుతున్న నేపథ్యంలో ప్రాణంతో ఉన్న కోళ్లనే అమ్మకాలు జరపాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కేవీ.నారాయణ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని తుంబూరు-కిష్టాపురం మధ్యనున్న చీకటి భాస్కరరావుకు చెందిన కోళ్లఫామ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.



చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న వెంకటనారాయణ

రహదారుల ఆక్రమణపై స్పెషల్ డ్రైవ్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఐటీ హబ్ వరకు, అక్కడ నుంచి రోటరీనగర్ వరకు రోడ్డు ఆక్రమణలపై కేఎంసీ డీఆర్ఎఫ్, పట్టణ ప్రణాళిక అధికారులు మూకుమ్మడిగా బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రహదారి వెంట అక్రమణలను తొలగించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలను తీసుకున్నారు.

అయితే డీఆర్ఎఫ్ బృందాలు, పట్టణ ప్రణాళిక అధికారుల తీరు పలు విమర్శలకు తెరలేపింది. పదే పదే ఒకే రహదారి వెంట అక్రమణలు తొలగిస్తున్నారని ఇతర రహదారులకు ఎందుకు వెళ్లటం లేదని స్థానికులు, చిరు వ్యాపారులు ప్రశ్నించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	20
గుత్తి వంకాయ	30
బీరకాయ	44
పచ్చిమిర్చి	26
కాకరకాయ	44
బెండకాయ	44
పొట్లకాయ	34
దోసకాయ	34-44
చిక్కుడు	44
నాటుచిక్కుడు	60
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	20
దొండ	28-36
సొరకాయ	18
క్యారెట్	30
క్యాప్సికం	54
ఆలుగడ్డ	28
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	150
కొత్తిమీర కట్ట	10

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	తండేల్
శ్రీనివాస:	డాకూ మహరాజ్
సాయిరాం:	పట్టుదల
కేపీఎస్:	ఒక పథకం ప్రకారం
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

పోలేపల్లి, పల్లెగూడెంలో

ఓటర్ల జాబితాకు నోటిఫికేషన్



ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పోలేపల్లిని పంచాయతీగా గుర్తిస్తూ కొత్త ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ. రాణికుముదిని బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న పోలేపల్లి పంచాయతీలో కొంత భాగం ఏదులాపురం మునిసిపాలిటీలో కలిసిన విషయం తెలిసిందే. దీనితో పాటు పల్లెగూడెం పంచాయతీలో రెడ్డిపల్లి గ్రామంలో కొన్ని వార్డులు ఏదులాపురంలో కలిపారు. వాస్తవానికి పోలేపల్లి పంచాయతీల్లో ప్రస్తుతం 4925 జనాభాతో 12వార్డులున్నాయి. పల్లెగూడెం గ్రామ పంచాయతీలోనూ 2,509 జనాభాతో 10వార్డులున్నాయి. అయితే పోలేపల్లి గ్రామపంచాయతీలో కొన్ని వార్డులతో పాటు 1,650 జనాభా ఏదులాపురం మునిసిపాలిటీలో కలిపారు. పల్లెగూడెం గ్రామపంచాయతీలోనూ 2,509 జనాభాలో 791జనాభాతో కొన్ని వార్డులు ఏదులాపురంలో కలిపారు. ఈ నేపథ్యంలో మిగిలిన జనాభా ఆధారంగా పోలేపల్లి గ్రామపంచాతీగా 12వార్డులతో (ప్రతి 3వేల జనాభా దాటితే 12 వార్డులతో) కొత్తగా పంచాయతీగా ఏర్పాటు చేయనున్నారు. పల్లెగూడెం పంచాయతీలో 1712 జనాభాతో 10వార్డులతో నోటిఫై చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 14న ఓటర్లతో జాబితాను వార్డులను ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. వీటిని ఆ రెండు గ్రామపంచాయతీలతో పాటు మండలపరిషత్ కార్యాలయంలో ప్రదర్శనకు పెడతారు. వీటిపై 15వ తేదీన రాజకీయ పార్టీలతో ఎంపీడీవోలు సమావేశాన్ని నిర్వహిస్తారు. 14 నుంచి 16వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 17వ తేదీన జిల్లా పంచాయతీ అధికారులు అభ్యంతరాలను పరిష్కరిస్తారు. ఆ తర్వాత పంచాయతీలు, వార్డులు, ఓటర్ల జాబితాను సాయంత్రానికి ప్రకటిస్తారు. దీని ఆధారంగా ఈ నెల 18న మండల, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



మోహన్‌రావును సన్మానిస్తున్న నాయకులు

యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా మోహన్‌రావు

ఖమ్మం చర్చికాంపౌండ్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యాదవ మహాసభ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా చెక్కిలాల మోహన్‌రావు యాదవ్‌ను నియమించినట్టు సంఘం జిల్లా అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం తెలిపారు. నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో కూరాకుల హాజరై మాట్లాడారు. జిల్లాలో యాదవుల్లో ఉన్న విద్యావంతులందరని ఏకం చేసి యాదవుల చైతన్యం కోసం కృషిచేస్తామన్నారు. అనంతరం మోహన్‌రావు మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించినందుకు సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో తెలంగాణ యాదవమహాసభ జిల్లా కార్యదర్శి గుమ్మారోశయ్య, ప్రెసిడెంట్ బారీ మల్సూర్, కోడిలింగయ్య, చిత్తారు ఇందుమతి, గోసు వీరభద్రం, డాక్టర్ నూతలకంటి పెద్దిరాజు, కొప్పుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

» రాజేశ్వరపురంలో స్వల్ప ఉద్రిక్తత » పోలీసుల రాకతో ప్రశాంతం



అక్రమ నిర్మాణాన్ని కూల్చుతున్న దృశ్యం

నేలకొండపల్లి,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): రాజేశ్వరపురంలో రోడ్డుపై అక్రమంగా నిర్మించిన గదిని బుధవారం మండల అధికారులు పోలీసుల సహాయంతో ట్రాక్టర్ డోజర్‌తో కూల్చివేసారు. వివరాల ప్రకారం.. రాజేశ్వరపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేస్తుండగా అడ్డుగా ఉన్న కట్టడాన్ని తొలగించాలని సంబంధిత వ్యక్తి బీసు కృష్ణయ్యకు గ్రామ పంచాయతీ నోటీసు ద్వారా తెలిపింది. తిరిగి రెండో సారి నోటీసు ఇచ్చినప్పటికీ ఫలితం లేక పోవటంతో సీసీ రోడ్డు నిర్మాణాన్నిపూర్తి చేయించాలన్న ఉద్దేశ్యంతో అధికారులు బుధవారం అక్రమమని పేర్కొంటున్న కట్టడాన్ని కూల్చటానికి ట్రాక్టర్ డోజర్‌ను తీసుకెళ్లి కూల్చటం ప్రారంభించారు. దీంతో యజమాని బీసు కృష్ణయ్య తాను గత 30 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నానని, అధికారులకు ఇది అక్రమ కట్టడమని ఇప్పుడు తెల్సిందా అని ప్రశ్నిస్తున్నాడు. అధికారులు నోటీసులిచ్చామని చెపుతున్నా, సంబంధిత వ్యక్తి మాత్రం తనకు ఎటువంటి నోటీసులు ఇవ్వలేదని చెప్పటం గమనార్హం. దీంతో సీసీరోడ్డు వేసే వద్ద కొంత ఉద్రిక్తత నెలకొంది. ఎంపీవో శివ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దీంతో అధికారులు అక్రమ కట్టడాన్ని కూల్చేయటంతో సీసీ రోడ్డు పనులు యథావిధిగా ఎంపీవో శివతో పాటు రాజేశ్వరపురం గ్రామ కార్యదర్శి నరేష్ సంఘటనా స్థలం వద్ద ఉన్నారు.



ప్రతిభచాటిన విద్యార్థులు

టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు టాలెంట్ టెస్టులో ప్రతిభచాటారు. పరిశ సీతారాత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం పిండిప్రోలులో మండలస్థాయి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈసందర్భంగా జల్లేపల్లి కి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో ప్రతిభచాటారు. విద్యార్థులను హెచ్ఎం దారా రాజేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలి

» మాస్‌లైన్ జిల్లా నాయకుడు కె.నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకుడు కె.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన పార్టీల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.2లక్షల వరకు ఉన్న రైతులకు రుణమాఫీ అందలేదని దీంతో వారు ఇబ్బదులు పడుతున్నారన్నారు. రూ.2లక్షలపైన ఉన్న రైతులకు కూడా బ్యాంకులలో డిపాజిట్‌చేశారని, వారికి కూడా నేటి వరకు రుణమాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు అమలుచేయాలన్నారు. ఈసమావేశంలో యడపల్లి నవీన్, పి.వెంకటస్వామి, ఆరెంపుల వెంకన్న, మీగడ సత్యం, మధు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలి

» పీడీఎస్‌యూ డిమాండ్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంతో కీలకమైన విద్యాశాఖకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిని కేటాయించకపోవటం విచారకరమని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ ఆరోపించారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వెంకటేష్ మాట్లాడారు. ఎంతో కీలకమైన విద్యాశాఖకు ఏడాదిగా మంత్రి లేకపోవటం విద్యా సమస్యలు పెరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, వినయ్, పృథ్వి, సాధిక్, సందీప్, యశ్వంత్, నసీర్, వెంకటేష్ పాల్గొన్నారు.

‘మున్నూరుకాపులను తగ్గించి చూపడం సరికాదు’



మాట్లాడుతున్న గుండాల కృష్ణ

ఖమ్మం చర్చికాంపౌండ్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): బీసీ కులగణనలో మున్నూరుకాపు జనాభాను 18శాతం నుంచి 8శాతానికి తగ్గించి చూపడం తగదని మున్నూరుకాపు సంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ అన్నారు. బుధవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్యపటేల్ ఆదేశాల మేరకు రానున్న తీసుకోవాల్సిన పలు అంశాలను చర్చించారు. ఈనెల 14న మున్నూరుకాపులను అన్నివర్గాలతో కలెక్టర్లకు, 17న తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందించాలని నిర్ణయించామని తెలిపారు. ఈకార్యక్రమాలను పార్టీకలతీతంగా చేపట్టాలని తీర్మానించారు. ఈవిషయమై జరిగే ఆందోళనలో బీసీ కులాలు కలిసిరావాలని కోరారు. ఈకార్యక్రమంలో పొదిల రవికుమార్, కొత్త సీతారాములు, పసుపులేటి వెంకట్, పసుపులేటి నాసరయ్య, రాపర్తి రాజా, మాటేటి రవి, పగడాల నరేందర్ పాల్గొన్నారు.

టీఎన్‌జీవోల జిల్లా డైరీ ఆవిష్కరణ

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా టీఎన్‌జీవోస్ యూనియన్ నూతన సంవత్సర డైరీని కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ బుధవారం ఆవిష్కరించారు. హైదరాబాదు నాంపల్లిలోని టీఎన్‌జీవోస్ యూనియన్ కేంద్ర సంఘ కార్యాలయంలో ఖమ్మం జిల్లా డైరీని జగదీశ్వర్‌తో పాటు ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని ముజీబ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ సమస్యల పరిష్కారానికి టీఎన్జీవో ఎప్పుడు ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటైన ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్‌ను వారు అభినందించారు. ఉద్యోగుల పక్షాన నిలబడి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్రసంఘం కోశాధికారి రామినేని శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అమరనేని రామారావు, కంచర్ల భార్గవ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, పక్కన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్

నగరంలో నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా గురువారం నెహ్రూనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ ప్రకటించారు. మేకలబండ పార్కు, బోడ్రాయి ప్రాంతం, వైరా రోడ్డు, వినాయక హాస్పటల్, మాజీ ఎంపీ నామా నివాసం ప్రాంతం, బోగంకుంట, నిజాంపేట ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మద్దులపల్లి మార్కెట్ ప్రారంభం

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దులపల్లి మోడల్ మార్కెట్‌ను బుధవారం అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ అదనపు సంచాలకుడు ఆర్.లక్ష్మణుడు క్రయ విక్రయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మార్కెట్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంవో అలీం, ఏఎంసీ సీజీఎస్.ప్రవీణ్ కుమార్, ఈఈ ఎల్లేష్, టెక్నికల్ కన్సల్‌టెంట్ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణుడు అట్లూరి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. తల్లిదండ్రులు, గురవుల ఆకాంక్ష నెరవేర్చే అద్భుత అవకాశం విద్యార్థుల చేతుల్లోకి వచ్చిందని, వృత్తిర్ణత ఒక్కటే లక్ష్యంగా రాబోయే రోజుల్లో శ్రమించాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ఫలితాల్లో ‘బొమ్మ’ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ప్రకటించిన ద్వితీయ సంవత్సరం మొదటి సంవత్సర సెమిస్టర్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించామని విద్యాసంస్థల ఛైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ ఛైర్మన్ బొమ్మ సత్యప్రసాద్ తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు సీఈసీలో జి.గౌరి 89శాతం, సంగీత 88, రచన 83, అఖిల 83, శ్రావణి , సౌజన్య 82, హారిక 81శాతంతో ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను వారు అభినందించారు.

ధృవనారాయణ మృతికి సంతాపం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు, బిహార్ రాష్ట్రానికి చెందిన ధృవనారాయణ(70) బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. మృతుడు ధృవనారాయణకు మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఖమ్మంలో రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ధృవనారాయణ విప్లవోద్యమంలో అనేక పోరాటాలుచేశారని, నక్సల్‌బరి ఉద్యమంలో కీలకంగా పనిచేశారన్నారు. సీపీఐ(ఎంఎల్) పార్టీలో పనిచేశారని గుర్తు చేశారు. గతేడాది ఖమ్మంలో నిర్వహించిన మాస్‌లైన్ జాతీయ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైనారని తెలిపారు.

‘ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి’

కొణిజర్ల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అత్యధిక విస్తీర్ణంలో మిర్చి సాగు చేస్తున్న నేపథ్యంలో ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని సింగరాయపాలెంలో బుధవారం మిర్చి ధర క్వింటాకు రూ. 25 వేల చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. గత సీజన్ ప్రారంభంలో మిర్చి క్వింటాకు రూ.23వేలు ఉంటే నేడు రూ.12వేలకు పడిపోయిందని అన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన కోరారు.

ఘనంగా సత్యసాయి మందిర 26వ వార్షిక వేడుకలు

నేలకొండపల్లి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని సాయి సుందర రామదాస మందిర 26వ వార్షిక వేడుకలు బుధవారం మందిరంలో అత్యంత వైభవంగా జరిగాయి. బుధవారం ఉదయం ఓంకారం, సుప్రభాతంతో పాటుగా నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం శ్రీషిరిడీ సాయినాథుడికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం మందిరంలో పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలచే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాయి సేవా సమితి రాష్ట్ర సేవాదళ్ సమన్వయకర్త కొమరగిరి శ్యాంప్రసాద్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి చేసిన సేవలను వివరించారు. సాయి మహిమలను భక్తులకు తెలియచేసారు. మండలం నుంచి వచ్చిన దాదాపు 12 పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి నాయకుడు వంగవేటి భాస్కరరావు, మండల కార్యదర్శి గెల్లా వెంకటరమణగుప్తాలతో పాటుగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న సత్యసాయి సేవా సమితి ఏపీ కన్వీనర్ శ్యాంప్రసాద్

‘పది’ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న దృశ్యం

నేలకొండపల్లి,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోదులబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో బోదులబండ మాజీ సర్పంచ్ అనగాని అనిత పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందచేసారు. 20 మందికి పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందచేసారు. అనంతరం అనిత మాట్లాడుతూ రానున్న పదో తరగతి పరీక్షలో విద్యార్థులు రాణించాలని, మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు తేవాలని, ఉన్నత స్థానాలకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27 నుంచి కరుణగిరి ఉత్సవాలు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి మార్చి 2వతేదీ వరకు మండల పరిధిలోని కరుణగిరి పుణ్యక్షేత్రంలో కరుణగిరి ఉత్సవాలు నిర్వహిస్తామని బిషప్ సగిలి ప్రకాష్ తెలిపారు. బుధవారం కరుణగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరవుతారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిషప్ ప్రకాష్



రామాలయ వార్షికోత్సవం

వేంసూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపాడులో రామాలయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నోస్ ల్యాబ్ అధినేత భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి కిరీటలను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

నాటక పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

మధిరరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీసీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల స్థాయిలో నిర్వహించనున్న పౌరాణిక నాటక పోటీల బ్రోచర్‌ను బుధవారం మాటూరుపేటలో ఆవిష్కరించారు. సీతారామా కళాపరిషత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 21, 22, 23 తేదీల్లో మధిరలో క్లబ్ అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నారు. మాటూరుపేట రామాలయంలో జరిగిన కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు పుతుంబాక కృష్ణప్రసాద్, గడ్డం సుబ్బారావు చేతులమీదుగా ఈ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాయల కోటయ్య, గుర్రాల కృష్ణారెడ్డి, అన్నెం కృష్ణమూర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో స్వచ్ఛత కరువు

» చెత్తాచెదారంతో నిండిన ఎంపీడీవో, గ్రామ పంచాయతీ భవనాలు » పట్టించుకోని అధికారులు



మండల పరిషత్ కార్యాలయం పక్కన ఉన్న వ్యర్థాలు

తల్లాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతలో ఆదర్శంగా ఉండాల్సిన మండల ప్రజాపరిషత్, మేజర్ గ్రామపంచాయతీ ఆవరణం మురికికూపంగా మారింది. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగునీటి ప్రవాహంతో మండల కేంద్రమైన తల్లాడలోని మండల ప్రజాపరిషత్, గ్రామపంచాయతీ ప్రాంగణం దుర్గంధం వెదజల్లుతుంది. మండల ప్రజాపరిషత్ కార్యాలయం పక్కనే ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. వాడిపడవేసిన పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా ఉన్నాయి. గ్రామపంచాయతీ కార్యాలయం వెనుకభాగంలో కూడా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. మండల పరిషత్, గ్రామపంచాయతీ కార్యాలయాల పక్కనుంచి ఏర్పాటు చేసిన డ్రెయినేజీలో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుంది. పరిసరాల్లో పరిశుభ్రత లోపించడంతో దోమలు వృద్ధి చెంది కార్యాలయాలకు వచ్చే ప్రజలు దోమకాటుకు గురవుతున్నారు. తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిత్యం తడి, పొడి చెత్త సేకరణ కోసం గ్రామపంచాయతీకి చెం దిన రెండు ట్రాక్టర్లను వినియోగిస్తున్నప్పటికీ మండల ప్రజాపరిషత్, గ్రామపంచాయతీ ప్రాంగణాల్లో మాత్రం అపరిశుభ్రత తాండవిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండల ప్రజాపరిషత్, గ్రామపంచాయతీ కార్యాలయాల ప్రాంగణం పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టూరి కుటుంబానికి మంత్రి తుమ్మల పరామర్శ



మట్టూరి భద్రయ్య దంపతుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

కల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగాల గ్రామంలో సిపిఎం పోరాట యోధుడు, మాజీ సర్పంచులు మట్టూరి భద్రయ్య, సీతారత్నం దంపతులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భద్రయ్య సోదరుడైన కృష్ణయ్య, కుమారులైన శ్రీనువాసరావు, స్టాలీన్, కుమార్తె రమాదేవిలతో మంత్రి తుమ్మల మాట్లాడారు. భద్రయ్య, సీతారత్నం దంపతుల చిత్రపటాలకు మంత్రి తుమ్మల పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దిరిశాల నరిసింహారావు, సూర్యదేవర రవికుమార్, హరిష్, పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు, మట్టూరి జనార్ధన్‌రావు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, మాదాల గోపాలరావు, పొట్రు సత్యం పాల్గొన్నారు.

రాజశ్యామల యాగంలో పాల్గొన్న మంత్రి

సత్తుపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని వేంచేసియున్న శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో బుధవారం నిర్వహించిన రాజశ్యామల దశ మహా విద్యయాగంలో రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోమంలో పాల్గొని పూజలు, క్రతువులు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాగం ఉద్దేశ్యం రాష్ట్ర క్షేమం, ప్రజా సంక్షేమం కోసమేనన్నారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు తేరాల సుబ్రహ్మణ్యశాస్త్రి మంత్రి తుమ్మలను స్వామివారి శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించారు.

తల్లాడలో

తల్లాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. తల్లాడలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని బయోమాస్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, జక్కంపూడి కిషోర్ పాల్గొన్నారు.

'విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి'

తల్లాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలంలో పెరగబోయే విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్(ఆపరేషన్) రాజీవ్‌చౌహాన్ ఆదేశించారు. బుధవారం తల్లాడ సబ్‌డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపడుతున్న ఆధునీకరణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మిగిలిన పనులను కూడా నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్, సత్తుపల్లి, వైరా డీఈలు ఎల్.రాములు, శ్రీనివాసరావు, ఏడీఈలు సతీష్, కిరణ్ పాల్గొన్నారు.

ఆఫ్‌టైప్ మొక్కల అవకతవకలపై విచారణ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగళ్లపాడు ఆయిల్‌పామ్ నర్సరీలో ఆఫ్‌టైప్ మొక్కలలో జరిగిన అవకతవకలపై అధికారుల బృందం బుధవారం సత్తుపల్లిలో విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వరంగల్ ఉద్యానవన శాఖ జేడీ సంగీతలక్ష్మి సత్తుపల్లి ఆయిల్‌ఫెడ్ కార్యాలయంలో గతంలో ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారిగా పనిచేసిన బాలకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణారావు, నర్సరీ ఇన్‌చార్జి పృథ్వీలను వేర్వేరుగా విచారించారు. కార్యక్రమంలో డీహెచ్ఎస్‌వో మధుసూదన్, హెచ్ఓ టెక్నికల్ అనితశ్రీ పాల్గొన్నారు.

బొగ్గును తడుపుతూ లోడింగ్ చేయాలి

» సింగరేణి డైరెక్టర్ (ఈఎం) సత్యనారాయణ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సైలోబంకర్ వద్ద బొగ్గును తడుపుతూ దుమ్ము లేవకుండా లోడింగ్ చేయాలని సింగరేణి డైరెక్టర్ (ఈఎం) డి.సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని కిష్టారంలోని జేవీఆర్ సీహెచ్‌పీ సైలోబంకర్‌ను సందర్శించారు. సమీపంలోని అంబేద్కర్ నగర్‌కు బొగ్గుకు సంబంధించిన దుమ్ము వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్తగా అదనపు దుమ్ము నివారణ యంత్రాలను ఏర్పాటు చేయాలని, ఎన్విరాన్‌మెంట్ అధికారులతో చర్చించి వాతావరణంలోని పోల్యూషన్ రీడింగ్స్‌ను తనిఖీ చేయాలన్నారు. కాలుష్యాన్ని నిలువరించేలా చెట్లను పెంచి దుమ్ము బయటకు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలెంరాజు, అధికారులు సూర్యనారాయణ, రామకృష్ణ, ఎన్‌వీఆర్.ప్రహ్లాద్, సోమశేఖర్ పాల్గొన్నారు.

రైతు భరోసాలో అంకెలతో గందరగోళం

» రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

వైరా, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎకరం, రెండెకరాల్లోపు ఉన్న రైతులకు కూడా రైతు భరోసా జమ కాలేదని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. రైతుభరోసాలో అంకెలు, సంకెలు గందరగోళంగా ఉన్నాయని పేర్కొన్నారు. బుధవారం వైరా మండలం అష్టగుర్తిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎకరం ఉంటే రెండు, మూడు కుంటల భూమికి, రెండెకరాల భూమి ఉంటే రెండు కుంటల భూమికి రైతుభరోసా బ్యాంకు ఖాతాలకు జమచేశారన్నారు. రెండెకరాల్లోపు సాగుభూములకు కూడా పూర్తిస్థాయిలో రైతుభరోసా జమకాలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ కొణిదన కోటేశ్వరరావు, రైతుసంఘం, సీఐటీయూ నాయకులు బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలి'

మధిర రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తాజా తెలంగాణ కులగణన ఆధారంగా ముస్లింల జనసంఖ్యను బట్టి అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలని మధిర ముస్లిం ఐక్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మధిరలో జరిగిన ముస్లిం ఐక్యసంఘం సమావేశంలో సంఘం అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్, షేక్.గాలీబ్, మహ్మద్ గౌసుద్దీన్ మాట్లాడుతూ ముస్లిం జనాబా తెలంగాణ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నట్లు కులగణన నివేదికలో స్పష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాగుల్‌మీరా, సుబానీ, హుస్సేన్‌సాహెబ్ పాల్గొన్నారు.

న్యూలిటిల్‌ఫ్లవర్ విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

వైరా, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాల్లో న్యూలిటిల్‌ఫ్లవర్ ఫౌండేషన్ విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారు. 36మంది విద్యార్థులు జేఈఈ మెయిన్ పరీక్ష రాయగా వీరిలో 19మంది విద్యార్థులు అర్హత సాధించి అడ్వాన్స్ రాయడానికి అర్హత సాధించారు. 90 శాతంపైగా 9మంది విద్యార్థులు మార్కులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను న్యూలిటిల్ ఫ్లవర్ ఫౌండేషన్ కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ అభినందించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

» దిశ కమిటీ మాజీ సభ్యుడు బాలాజీ

ఏన్కూరు, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ దిశ కమిటీ సభ్యుడు బాదావత్ బాలాజీ కోరారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ఆదేశాల మేరకు బుధవారం ఏన్కూరులో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు యంద్రాతి మో హన్‌రావు, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, చీటి కోటేశ్వరరావు, పుల్లయ్య, బాలాజీ, ముదిగొండ నాగేశ్వరరావు, అజ్మీరలైలు, ప్రసాద్, పూర్ణ కంటి నాగరాజు, ఖాసీం, చీటి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతు సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహించాలి

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీసంతు సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం వైరాలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గస్థాయి బంజారా నాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతు సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఈనెల 15న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందన్నారు. జయంతి వేడుకలకు ప్రభుత్వం నిధులు కేటాయించటం సంతోషదాయకమన్నారు. సంతు సేవాలాల్ జయంతిని పండుగ వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. వైరా మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దాసరి దానియేలు, కట్ల రంగారావు, బొళ్ల గంగారావు, సూరంపల్లి రామారావు, మంజీలాల్‌నాయక్, నవీన్‌రాథోడ్, లచ్చూనాయక్, రాంమ్మూర్తినాయక్, భీముడునాయక్ పాల్గొన్నారు.

ప్రవేశ ద్వారాలను పునరుద్ధరించండి

వైరా, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో మూసివేసిన రెండు ప్రవేశ ద్వారాలను వెంటనే పునరుద్ధరించాలని ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎంకు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ స్పష్టం చేశారు. బుధవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మూసివేసిన బస్టాండ్‌లోని రెండు ప్రవేశద్వారాలను పరిశీలించారు. నాలుగున్నర దశాబ్ధాలుగా ఈ బస్టాండ్‌కు నాలుగు ప్రవేశ ద్వారాలు ఉండగా ఇటీవల ఆర్టీసీ అధికారులు జాతీయ ప్రధాన రహదారి వైపు ఉన్న రెండు ప్రవేశ ద్వారాలను మూసివేయడంతో బస్సుల డ్రైవర్లతోపాటు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో ఆయన బస్టాండ్‌ను సందర్శించి పరిశీలించారు. అక్కడున్న స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే ఆర్టీసీ ఆర్ఎంతో ఫోన్లో మాట్లాడి మూసివేసిన ప్రవేశ ద్వారాలను పునరుద్ధరించాలని సూచించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, నాయకులు సూతకాని జైపాల్, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, దాసరి దానియేలు, బొళ్ల గంగారావు, ధార్న రాజశేఖర్, పణితి శ్రీను పాల్గొన్నారు.

మిర్చి రైతుల మహాధర్నాను జయప్రదం చేయండి

ఏన్కూరు, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మిర్చి కి మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల17 ఖమ్మంలో జరిగే రైతు మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. బుధవారం జన్నారం గ్రామంలో మిర్చి రైతులు మహాధర్నా జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడారు. ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమలో జన్నారం మాజీ ఉపసర్పంచ్ అడపా రామారావు, రైతులు స్వర్ణ కృష్ణారావు, అడపా శ్రీనివాసరావు, జాగర్లముడి శ్రీనివాసరావు, తాళ్లూరి లక్ష్మయ్య, అముదల వెంకన్న, సిర్రా కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైరా, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మిర్చి క్వింటాకు మార్కెట్లో రూ.25వేలు కనీస మద్దతు ధర కల్పించి రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం వైరా మండలం అష్టగుర్తిలో మిర్చికల్లాల వద్ద రైతులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో సుంకర సుధాకర్, తూము సుధాకర్ పాల్గొన్నారు.

చింతకాని మేజర్‌కు సాగర్ నీటి విడుదల



సీఈ వసంతతో మాట్లాడుతున్న మండల నాయకులు

చింతకాని, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): చింతకాని మేజర్ పరిధిలో గత వారం రోజులుగా సాగర్ నీరు అందక చేతికొచ్చిన పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కన్నెబోయిన గోపి, ఆత్మకమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావులు ఇరిగేషన్ సీఈ రమేష్‌బాబు, సీఈ వసంతతో చర్చించి సమస్యను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు బుధవారం చింతకాని మేజర్‌కు సాగర్ నీటిని విడుదల చేశారు.

16న కారేపల్లిలో టీయూసీఐ మహాసభ

కారేపల్లి, ఫిబ్రవరి12: మండల కేంద్రంలో ఈనెల16న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ)ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పలుగ్రామాల్లో మహాసభను విజయవంతం చేయలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌వీ రాకేష్, గద్దల రమేష్, నాగార్జున్, నూకలరమేష్, దేవా, భద్యనాయక్ నాగభూషణం, సంపత్ తదితరులు పాల్గొన్నారు..

చెక్కుల పంపిణీ

ముదిగొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం మాజీ జడ్పీటీసీ బుల్లెట్ బాబు, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్‌లు బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెల అజయ్, మందరపు ఉ పేంద్రరావు, మాదాల శ్రీను, కొమ్ము నర్సింహారావు, ముదాకర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను రావాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసినట్లు పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు గంగారంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. పట్టణంలోని అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక డంపింగ్ యార్డులపై దాడిచేసి సత్తుపల్లి తహసీల్దార్‌కు అప్పగించామన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తా



మాట్లాడుతున్న నర్సిరెడ్డి

మధిరటౌన్/ ఎర్రుపాలెం/ బోనకల్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. బోనకల్, ఎర్రుపాలెం, మధిరటౌన్‌లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈనెల 27న జరుగు ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాదాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాలలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ తనిఖీ

బోనకల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్ పీహెచ్‌సీలను జిల్లా వ్యాక్సినేషన్ పర్యవేక్షణ అధికారి రమణ సందర్శించారు. వ్యాక్సిన్‌కు సంబంధించి రికార్డులను పరిశీలించారు. వయస్సు కు దగ్గ బరువుకు సంబంధించి చిన్నారుల గ్రో త్ రికార్డులను పరిశీలించి తక్కువ బరువు ఉన్న చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, సీహెచ్‌వో దానయ్య తదితరులు పాల్గొన్నారు.

నగదు అపహరణ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో రెగ్యూలర్ కండక్టర్‌గా పనిచేస్తున్న ఎండీ.షబానా బేగం ఉదయం ఖమ్మం వెళ్లి తిరిగి సత్తుపల్లి చేరుకోగా మధ్యాహ్నం 12.30సమయంలో ప్లాట్ ఫారం నెంబర్.1పై ఖమ్మం వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్నారు. ఈ క్రమంలో తన క్యాష్‌బ్యాగులోని రూ.2,840నగదు అపహరణకు గురైంది. గమనించిన కండక్టర్ సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్మీ జవాన్‌పై దాడి...

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చింతకాని, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఓ కేసు విచారణ నిమిత్తం చింతకాని పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బోనకల్ మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ బూదాల మనోజ్‌పై ఇదే మండలం గోవిందాపురం (ఎల్) గ్రామానికి చెందిన ఉమ్మనేని రమేష్, లగడపాటి సాయి ఇరువురు చింతకాని పోలీస్ స్టేషన్ ఆవరణలో అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేశాడని బాధితుడు ఆరోపించాడు. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు మనోజ్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్‌లో గత ఐదు రోజుల క్రితం జరిగిన ఘర్షణ కేసులో విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన తాను ఎస్ఐ దగ్గరకు వెళ్తుండగా అక్కడే ఉన్న ఉమ్మినేని రమేష్‌తో పాటు లగడపాటి సాయి అసభ్య పదజాలంతో దూషిస్తూ తనపై దాడి చేశారని మనోజ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్ఐ నాగుల్‌మీరాను వివరణ కోరగా విచారణ జరుపుతున్నామని అనంతరం బాధ్యులపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు

వైరా, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సమక్షంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన కొత్త, పాత నాయకులు కలిసి పనిచేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషిచేయాలన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, పొదిల హరినాథ్, పొదిల హరినాథ్, సంతోష్ పాల్గొన్నారు.

భక్తురాలి మెడలో బంగారు గొలుసుల చోరీ

ఎర్రుపాలెం ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామ సమీపంలో మహిళ మెడలో బంగారు గొలుసులను దొంగలు చోరీచేసిన ఘటన బుధవారం జరిగింది. ఎర్రుపాలెం ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరం గ్రామనికి చెందిన జొన్నిబోయిన వెంకటరమణ అనే భక్తురాలు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి పాదయాత్రగా కాలినడకన బయలుదేరింది. మార్గమధ్యలో గల నారాయణపురం గ్రామ సమీపంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి ఒక మహిళ పల్సర్ ద్విచక్రవాహనంపై వచ్చి 68గ్రాముల బంగారు నాంతాడు, నల్లపూసల గొలుసును భక్తురాలి మెడ నుంచి లాక్కొని పారిపోయారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాయిబాబా ఆలయంలో హుండీ చోరీ

బోనకల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బోనకల్ సాయిబాబా దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీని ఎత్తుకెళ్లారు. ఆలయానికి తాళాలు వేసి కాపలాదారులు నిద్రిస్తుండగా దొంగలు చాకచక్యంగా తాళాలు తీసి లోపలకు ప్రవేశించారు. ఆలయం లోపల ఉన్న హుండీతోపాటు చిన్న బ్యాగ్‌ను ఎత్తుకెళ్లారు. వారు వెళ్లిన గంట తర్వాత లైట్లు వెలగడం చూసి దొంగలు హుండీ ఎత్తుకెళ్లారని గుర్తించారు.